# అమానవీయ స్థితిలో 'ఆధునిక' భారతదేశంలో పాకీ పనివారు

**71** సంవత్సరాల స్వాతంత్ర్యమనబడే దాని తర్వాత మానవ మలమూత్రాలను పాకీ పనివారు తమ చేతులతో శుభ్రపరిచే, గంపలతో తమనెత్తిపై మోసుకెళ్ళే అనాగరిక, అమానవీయ ఫ్యూడల్ ఆచరణ మనదేశంలో ఇంకా కొనసాగుతోంది. రాజ్యాంగం కల్పించిందని చెబుతున్న, పౌరులందరూ సమానులే నన్న ప్రాథమిక హక్కులుగానీ, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలుగానీ, 1953 నాటి మనుష్యులతో పాకీ పనిచేయించటాన్ని నిషేధించే చట్టాలుగానీ, మానవ మలమూత్రాలను చేతులతో శుభ్రపరిచే ఉద్యోగాలు కల్పించడాన్ని నిషేధిస్తూ వారందరికీ పునరావాసం కల్పించటానికి ఉద్దేశించిన 2013 నాటి చట్టంగానీ–పాకీ పనివారి జీవితంలో ఆర్థికంగా కానీ, సామాజికంగాకానీ ఏలాంటి అభివృద్ధినీ తీసుకురాలేదు.

మానవ మలమూత్రాలను మనుష్యులతోనే శుభ్రం చేయించే పాకీపనిని నిషేదించటం, బయటి ప్రపంచాన్ని మోసగించటానికి వుద్దేశించిన కంటి తుడుపు చర్య మాత్రమే. భారతదేశం కూడా ఆధునిక, నాగరిక, ప్రగతిశీల దేశమని చూపెట్టుకోవటానికి చేసిన చట్టాలే ఇవన్నీ అని రుజువవుతోంది.

ఫ్యూడల్‌కాలపు పాకీ పనివిధానమే యథాతథంగా దేశవ్యాపితంగా ఈనాటికీ అనేక గ్రామీణ ప్రాంతాల్లోనూ, అదేవిధంగా కొన్ని దిగువ స్థాయి పట్టణాలలోనూ – ప్రత్యేకించి ఉత్తర భారతదేశంలో అమలుజరుగుతోంది.

కాగా, పట్టణ ప్రాంతాల్లో ఈ పాకీ పనే వివిధ ఇతర రూపాలలో అమలుజరుపబడుతోంది. నగర పాలకసంస్థలు, మునిసిపల్ కార్పొరేషన్లలో, భారత రైల్వేలవంటి ప్రభుత్వ సంస్థలలో ప్రమాదకరమైన, నీచంగా పరిగణించే పాకీ పనులను మనుష్యుల ద్వారా చేయిస్తున్నారు.

భారతదేశంలో పాకీ పనివారు, అదేతరహా పనులు నిర్వహించే వివిధ విభాగాల పారిశుద్ధ్య పనివారు అత్యధికంగా దోపిడీకి గురిచేయడుతోన్న అట్టడుగుస్థాయి కార్మికులు. వీరికి మానవులనే హుందాతనం, గౌరవం కూడా నిరాకరించ బడుతున్నాయి.

ఎన్‌డిఏ పాలకులు ఆర్భాటంగా ప్రకటిస్తున్న ప్రస్తుత 'అచ్చేదిన్' 'స్వచ్ఛభారత్' రోజుల్లో కానీ లేదా ఉన్నత న్యాయస్థానాలు ఖచ్చితంగా అమలుచేయాలని ఇచ్చిన ఆదేశాలుకానీ, పాకీపనివారి జీవితాలలో ఆర్థిక, సామాజిక అభివృద్ధిని కల్పించలేదు.

దీనికి తోడుగా నేడు మన దేశంలోని వివిధ నగరాలు, పట్టణాలలో మురుగు గొట్టాలలో దిగి శుభ్రంచేసే పనిలో అనేకమంది పాకీ పనివారి, పారిశుద్ధ్య కార్మికుల మరణాలను రోజూ పత్రికలలో చూస్తున్నాం. మురుగునీటిలో అడ్డులను తొలగించటం, సెప్టిక్ ట్యాంకులలో దిగి శుభ్రంచేయటం వంటి ప్రమాదకర విధులలోకి కార్మికులను వ్యక్తులుగా గానీ, స్థానిక సంస్థలుగానీ విధుల్లోకి దించటాన్ని 2013 చట్టం నిషేదిస్తున్నప్పటికీ, మున్సిపాలిటీలు, రైల్వేల వంటి ప్రభుత్వ సంస్థలు ఆ నిబంధనలను ప్రక్కన పడేస్తున్నాయి. కాంట్రక్టర్లద్వారా పారిశుద్ధ్య కార్మికులను పనుల్లోకి తీసుకుంటూ, ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలను ఈ కార్మికులకు చెల్లించకుండా ఎగవేయటంతోపాటు, కార్మికుల భద్రత విషయంలోనూ చేపట్టవలసిన కనీస చర్యలను సైతం గాలికొదిలేస్తున్నారు. పారిశుద్ధ్య, పాకీపనివారి భద్రతపట్ల కనీసపాటి శ్రద్ధకు కూడా నోచుకోకుండానే, నాగరీక ప్రపంచంగా చెప్పుకుంటున్న ఈ సమాజంలో మురుగును పరిశుభ్రంచేసే పనిలో వారు ప్రాణాలు కోల్పోతున్నారు. సెప్టిక్‌ట్యాంకులలో దిగి, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌లో దిగి ఊపిరందక అందులోనే అనేకమంది పారిశుద్ధ్య కార్మికులు మరణిస్తున్న వార్తలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. అయితే ఈ కార్మికులకు 'ప్రధాన యజమాని'గా (ప్రిన్స్‌పల్ ఎంప్లాయర్)గా వున్న మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు లేదా రైల్వేశాఖ, కార్మికులపట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించి, వారికి ఇవ్వవలసిన చట్టబద్ధ వేతనాలు, పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు, పనిప్రదేశాలలో మరణాలు సంభవించినపుడు చట్టబద్ధంగా వారి కుటుంబాలకు నష్టపరిహారాలు అందజేయటం వంటి బాధ్యతలన్నింటినీ ఎగవేస్తున్నాయి. పారిశుద్ధ్య కార్మికులను పనిలోకి తీసుకున్న కాంట్రాక్టర్లపై మొత్తం నెపాన్నంతా మోపుతూ వారిపై చర్యలు తీసుకుంటామనే ప్రకటనతో సరిపెడతాయి. అంతే తప్ప వారిపై కూడా ఏనాడూ చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. కాంట్రాక్టర్ల ద్వారా కార్మికులను పనిలో పెట్టుకున్న 'ప్రధాన యజమాని' వైపునుండి జరిగిన తీవ్ర నిర్లక్ష్యం తప్ప ఇది మరోటి కాదు. కాంట్రాక్టర్ల ద్వారా పనిలో పెట్టబడిన ఈ పారిశుద్ధ్య కార్మికుల మరణాలకు కారకులైన ఈ 'ప్రధాన యజమాని'ని తీవ్రంగా శిక్షించాల్సి వుంది.

పాకీపనివారల జాతీయ కమిషన్(ఎన్‌సిఎస్‌కె) తాజాగా రూపొందించిన నివేదిక ప్రకారం ప్రతి ఐదురోజులలో ఒక పారిశుద్ధ్య కార్మికుడు సెప్టింక్ ట్యాంకులోనో లేక మురుగునీటి గొట్టాలను శుభ్రం చేసే పనిలోనో ప్రాణాలొదులుతున్నాడు. వాస్తవానికి ఆ నివేదికలో పేర్కొన్న దానికంటే అధికంగానే వీరి మరణాలు సంభవిస్తున్నాయి. చాలా అరుదుగా మాత్రమే ఇలాంటి సందర్భాలలో మరణించిన కార్మికుల కుటుంబాలకు చట్టబద్ధ పరిహారాన్ని చెల్లించటం జరుగుతోంది.

సమాజం కూడా పాకీ పనివారి జీవితాల దుస్థితిపట్ల తగిన శ్రద్ధను కనబరచటంలేదు. పారిశుద్ధ్య, పాకీపనివారి సమస్యను సీరియస్‌గా తీసుకొని ఉద్యమించటంలో సాంప్రదాయ ట్రేడ్ యూనియన్లు చాలాకాలం క్రితమే విఫలమయ్యాయి. అట్టడుగు దళితుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తామని చెప్పే అనేక దళితసంఘాలు కూడా, నికృష్ట దారిద్ర్యంలో, కనీస హుందాతనం కరవైన, సమాజంలో ఘోరమైన అణచివేతకు గురవుతోన్న పాకీపనివారి సమస్యను ప్రధానాంశంగా చేబట్టటంలేదు.

'సఫాయి కర్మచారీల ఆర్థిక మరియు అభివృద్ధి సంస్థల' వంటి ప్రభుత్వ కార్పొరేషన్లు, పాకీపనివారి సంక్షేమం కోసమేనని చెప్పుకుంటున్నా వాస్తవాచరణలో వారినుండి అందుతున్న సహాయమేదీలేదు.

కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో నియమితమైన 'టాస్క్‌ఫోర్స్' బృందం దేశంలో ఈనాడున్న పాకీపనివారి సంఖ్యను సైతం లెక్కకట్టలేక పోవటంతో, అది కేవలం మొక్కుబడి తంతుగా మిగిలింది. దాదాపుగా ఇలాంటి సర్వేలనే గత 26 సం॥లుగా నిర్వహించినా భారతదేశంలో మానవ మలమూత్రాలను శుభ్రంచేసే పాకీపనివారి సంఖ్యను ఖచ్చితంగా, వాస్తవికంగా అంచనావేయలేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సర్వేలు నిర్వహించటానికి సహకరించటంలేదని అంటున్నారు. పాకీపని ఈరోజుకీ ఉనికిలో వుందని బయట ప్రపంచానికి తెలియటానికి గానీ లేదా దీనిని నిరదోధించని, వారికి శాశ్వత పునరావాస, చట్టబద్ధ సౌకర్యాలు కల్పించని తమ నిర్లక్ష్యం వెల్లడవకుండా వుండటానికిగానీ వారు ఈ సర్వేలకు సహకరించటంలేదు.

ఒక్కోజిల్లాలో సర్వేకు ఉద్దేశించబడిన ఈ 'టాస్క్‌ఫోర్స్' ఒకటో రెండో శిబిరాలు నిర్వహించి, పాకీపనివారిని తమవద్ద పేర్లు నమోదు చేసుకోవలసిందిగా కోరుతున్నాయి. ఇది సరైన పద్ధతిలో సర్వే నిర్వహించే విధానం కాదు. ఎక్కడో సుదూర ప్రాంతాలలోనున్న వారికి తమ పేరు నమోదు చేసుకోవాలనే సమాచారం తెలియటమూ కష్టమే. తెలిసినా వారు అక్కడికి చేరుకొని తమ పేరు నమోదు చేసుకోవటమూ అంతంత మాత్రమే. అంతేగాకుండా, తమ పేర్లు నమోదు చేసుకోవటానికి ముందుకు వచ్చిన వారిని సైతం జిల్లా అధికారులు తిప్పిపంపినట్లుగా కొందరు ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు ప్రకటించారు.

భారతదేశంలో ఉనికిలోవున్న పాకీ పనివారి గురించి వాస్తవాలను నమోదు చేయటంపట్ల ప్రభుత్వాల, ఉన్నతాధికారుల దుర్మార్గమైన దృక్పథం ఇలా వుంది. "ప్రభుత్వాలు వారిచేత ఒకవైపు ప్రమాదకరమైన, నీచంగా పరిగణించే పారిశుద్ధ్య, పాకీ పనులును చేయిస్తూనే వారి ఉనికిని గుర్తించటానికే నిరాకరిస్తున్నాయి. ఇక వారి అభివృద్ధి, సంక్షేమం గురించి పట్టించుకుంటాయనటం ఒట్టిమాట" అని ఈ అంశంపై పరిశోధన చేస్తున్న అంకుర్‌సింగ్ సరిగ్గా చెప్పాడు. అవును నిజమే, ఆధునిక భారతదేశంలో పాకీపనివారు అనాధలుగా, తృణీకరణకు గురై వున్నారనేది వాస్తవం.

oooooo